క్లుప్తంగా

వీధి విక్రయదారులు గుర్తింపు కార్డులు తీసుకోవాలి

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలోని వీధుల్లో వ్యాపారాలు నిర్వహించే వారు గుర్తింపు కార్డులు తీసుకోవాలని నగర కమిషనర్ పగడాల జగన్నాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మున్సిపల్ సిబ్బంది వీధి విక్రయదారుల సర్వే నిర్వహించబడుతుందని, విక్రయదారులు సర్వేకు సహకరించి గుర్తింపు కార్డులతో పాటు వెండింగ్ సర్టిఫికెట్ పొందాలని ఆయన తెలిపారు. గుర్తింపు కార్డులు పొందువారు పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో పాటు ఫ్యామిలీ ఫొటో, నివాస ధ్రువీకరణ పత్రం, రూ.100 చలానా చెల్లించాలని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 79016 10815 నెంబర్‌కు సంప్రదించాలని ఆయన అన్నారు.

నేత్రదానం



కుటుంబ సభ్యుల నుంచి నేత్రాలను స్వీకరిస్తున్న సేవాసమితి అధ్యక్షుడు రాజు

వీరపునాయునిపల్లె : మండలంలోని పాయసంపల్లె గ్రామానికి చెందిన నేసే మౌనిక (18) మంగళవారం మృతి చెందింది. మృతురాలి తల్లిదండ్రులు లక్ష్మిదేవి, సురేష్‌లు నేత్రదానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజుకు సమాచారం ఇవ్వడంతో వారు టెక్నిషియన్ హరీష్‌తో కలిసి మృతురాలి పార్థివ దేహం నుంచి కార్నియాలు సేకరించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్నా నేత్రదానికి అంగీకరించిన కుటుంబ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రత్యూష, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

15 నుంచి ఇస్కాన్ సమ్మర్ కల్చరల్ క్యాంప్

కమలాపురం : స్థానిక కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో ఈనెల 15వ తేదీ నుంచి ఇస్కాన్ సమ్మర్ కల్చరల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రెడ్డి సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ వరకు జరిగే ఈ క్యాంప్‌లో భగవద్గీత శ్లోకాలు, నీతి కథలు, ధ్యానం, క్రీడలు, నృత్యం తదితర అంశాలపై శిక్షణ నిస్తారన్నారు. 5, 6, 7, 8, 9వ తరగతి బాల బాలికలు అర్హులన్నారు. 14వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 29వ తేదీ శిక్షణచ్చిన అంశాలపై పరీక్ష నిర్వహిస్తామని, 30వ తేదీన విజేతలకు బహుమతులు అందజేస్తామని ఆయన అందులో పేర్కొన్నారు. ఆసక్తి గల బాల బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

15న జాబ్ మేళా

కమలాపురం : స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 15వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు డోన్, బీపీఓ, ఐటీ సొల్యూషన్స్, ఎబిఎల్ డిక్సన్, అరమ రాజా గ్రూప్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా ఎలక్ట్రానిక్స్, ట్రియో విషన్, కాంపోసైట్ టెక్నాలజీ తదితర 15 కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

వన మహోత్సవం



మొక్క నాటి నీరు పోస్తున్న విద్యార్థులు

చింతకొమ్మదిన్నె : జాతీయ సేవా పథకంలో భాగంగా తాడిగోట్ల గ్రామంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ లావణ్య అధ్వర్యంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్.ఎస్ అధికారి మాట్లాడుతూ మొక్కల పెంపకం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గి సకాలంలో వర్షాలు పడతాయన్నారు. ఈ కారణంగా వ్యవసాయ అభివృద్ధి జరిగి రైతులకు మేలు కలుగుతుందని వివరించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

పులివెందుల : మండలంలోని ఎర్రబల్లి, కొత్తపల్లి గ్రామాలలో సోమవారం కురిసిన వర్షాలకు, ఈదురు గాలులకు దెబ్బతిన్న అరటి పంటలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధృవకుమార్‌రెడ్డి, ఆ పార్టీ మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డిలు మంగళవారం పరిశీలించి మాట్లాడారు. దెబ్బతిన్న అరటి రైతులకు ప్రభుత్వం ప్రతి రైతుకు ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నట్లు వారు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నేరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వల్లూరు : చెరువుకిందపల్లె సమీపంలో జూదం ఆడుతున్న ఆరు మందిని మంగళవారం అరెస్ట్ చేసి వారివద్ద నుంచి రూ.6500 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు.

కదలని చెత్త, మురుగునీరు



వేంపల్లెలోని ప్రధాన రోడ్డులో నిల్వ ఉన్న చెత్తా చెదారాలు



వేంపల్లెలోని ఓ వీధిలో రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు నీరు



ప్రధాన రోడ్డులో నిల్వ ఉన్న చెత్త

వేంపల్లె : గ్రామపంచాయతీలో పారిశుద్ధ కార్మికులు సక్రమంగా పనిచేయకపోవడంతో ఎక్కడ చూసినా చెత్త, మురుగునీరు కదలడం లేదు. కూటమి నేతలు కళ్లెదుటే చూస్తున్న పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. కేవలం ప్రచార ఆర్భాటాల కోసమే తప్ప వేంపల్లె గ్రామపంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. ఆదాయ వనరుల కోసం వెంపర్లాడుతున్నారని... పారిశుద్ధ్య కార్మికులకు జీతాలను ఇప్పించి పారిశుద్ధ్య పనుల మెరుగునకు చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వ వైఫల్యంతో రెండు నెలలుగా వేంపల్లె గ్రామపంచాయతీలో ఈఓను నియమించకపోవడం ఇందుకు నిదర్శనం. పది రోజులు క్రితం ఈఓను నియమించిన ఆయన తన సొంత పనులు నిమిత్తం సెలవుపై వెళ్లారు. పారిశుద్ధ కార్మికులకు గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టడంలేదు. వారికి చెప్పే నాథుడే కరువయ్యారు. గతంలో ఎన్నడూ ఈ విధంగా జరగలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. కూటమి నేతల వైఫల్యం వల్లే ఏ అధికారి ఇక్కడ పనిచేయలేకపోవడం సిగ్గుగా ఉందని పలువురు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా ఇసుక, గ్రావెల్ మట్టి, ముగ్గు రాయి తవ్వుకొని సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు అనుకుంటున్నారు. గ్రామపంచాయతీలో ఏమి జరుగుతుంది అని తెలుసుకోకుండా.. కేవలం ఆర్థిక వనరులపై దృష్టి సారించి సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు అనుకుంటున్నారు. గ్రామపంచాయతీ పరిధిలో ఎక్కడా కూడా పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థలు అస్తవ్యస్తంగా తయారవుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఏ వీధికి వెళ్లినా మురుగు నీరు పారక రోడ్లపైకి వచ్చి చేరుతున్నాయి. ఇక పారిశుద్ధ్యం విషయానికొస్తే ఎక్కడ చూసినా ప్రధాన రహదారుల్లో చెత్తా చెదారాలు దిబ్బలు దిబ్బలుగా తయారయ్యాయి. ఇప్పటికైనా కూటమి నేతలు గ్రామపంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారించి డ్రైనేజీ, మురుగు లేకుండా చూడాలని పలువురు ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



ర్యాలీ నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు

వేముల : పంటల సాగులో ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏపీఎం ఆంజనేయులు తెలిపారు. మండలంలోని వి.కొత్తపల్లె, వేముల గ్రామాల్లో డ్వాక్రా మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయం ప్రణాళికపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమిని సహజ సిద్ధంగా సారవంతం చేయవచ్చునన్నారు. జీవన ఎరువులు వాడటంవల్ల రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గి రైతులకు పెట్టుబడి తగ్గుతుందన్నారు. పాడి పశువులు, పంటలను అనుసంధానం చేయడం ద్వారా ప్రకృతి వ్యవసాయ విధానాలను విస్తృతంగా అమలు చేయవచ్చునన్నారు. వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలను ప్రోత్సహించడానికి రుణాలను అనుసందానం చేయడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. డ్వాక్రా మహిళలు ఇంటి ఆవరణలో పెరటి తోటలు పెంచడంవల్ల పౌష్టికాహారం, పురుగు మందులు వాడని కూరగాయలు లభిస్తాయన్నారు. పంటలను ప్రకృతి వ్యవసాయంతో సాగు చేస్తూ విశేష కృషి చేస్తున్న రైతులను సన్మానించారు. అనంతరం డ్వాక్రా మహిళలకు పలు రకాల కూరగాయల విత్తన ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు జ్యోతి, నాగేశ్వరి, గ్రామ సమాఖ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అవగాహన కల్పించాలి



ఎఎన్ఎం, ఆశలకు సూచనలు ఇస్తున్న రఫిక్‌పాషా

జమ్మలమడుగు : గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు అయ్యేలా ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ రఫిక్ పాషా తెలిపారు. మంగళవారం ప్రభుత్వాసుపత్రిలో ఎఎన్ఎం, ఆశ వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిబ్బంది తమ పరిధిలో ఇంటింటికి వెళ్లి బాలింతలు, గర్భిణుల వివరాలను నమోదు చేయడంతోపాటు వారు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. స్త్రీ పురుషులకు వచ్చె సుఖవ్యాధుల పట్ల, మొదటి కాన్పు అయ్యే వారు ఎవరైనా ఉంటే వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిని ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు అయ్యే విధంగా పెద్ద వారిని ఒప్పించాలని సూచించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్ఓ శివప్రసాద్‌రెడ్డి, డాక్టర్ విజయలక్ష్మీలు మాట్లాడుతూ ఎక్కువగా సీజరిన్ ఆపరేషన్లు జరుగుతున్నాయి. వాటి సంఖ్యను తగ్గించి మాములు కాన్పులు అయ్యేవిధంగా చూడాలని సూచించారు. ఏమైనా హైరిస్కు కేసులు ఉంటే వీటిని జిల్లా ఆసుపత్రి గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తూ 108 వాహనాన్ని ఉపయోగించాలని తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీలత

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ శ్రీలత ఆధ్వర్యంలో మంగళవారం కిశోర బాలికలకు బాలల హక్కులు, ఫోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె ప్రదానంగా జీవించే హక్కు, సంరక్షణ హక్కు, కావల్సిన నిర్ణయాలు తీసుకునే హక్కు, బావోద్వేగ, మానసిక, శారీరక వికాసం చెందే హక్కు గురించి క్షుణ్ణంగా వివరించారు. అలాగే అక్రమ చైల్డ్ లేబర్, బానిసత్వం, వెట్టి చాకిరి తదితర విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాబున్ని, అంగన్‌వాడీ కార్యకర్త విజయభారతి, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని రావులకొలను అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత కుమారి ఆధ్వర్యంలో బాలల హక్కులు, బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాల్య వివాహాల నిషేద చట్టం, విద్యా హక్కు చట్టం, బాల కార్మిక చట్టం, ఫోక్సో చట్టాల గురించి కిశోర బాలికలకు వివరించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు మాధవి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్, కిశోర బాలికలు పాల్గొన్నారు.

నల్ల చట్టాలను వ్యతిరేకిద్దాం



మాట్లాడుతున్న ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు మెంబర్ మౌలానా ఇస్‌హాఖ్ ఆలీ

పులివెందుల టౌన్ : నల్ల చట్టాలకు వ్యతిరేకంగా నిరసన ఉద్యమాలు చేపడతామని, వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకునేవరకు పోరాటం ఆగదని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు మెంబర్ మౌలానా ఇస్‌హాఖ్ అలీ తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక రాయల్ ఫంక్షన్ హాలులో ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకునే వరకు ముస్లిం మైనార్టీ చేసే ప్రతి పోరాటానికి జేఏసీ సిద్ధంగా ఉండాలని, తమ న్యాయమైన హక్కును సాధించుకునేవరకు పోరాటాలు ఆగవన్నారు. ఈనెల 16వ తేదీ తర్వాత వక్ఫ్ చేపట్టే కార్యాచరణ చేపడతామన్నారు. ఈ సందర్భంగా ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రెసిడెంట్లు పులివెందుల నియోజకవర్గ జేఏసీ కన్వీనర్‌గా అబ్దుల్ మౌలానా, నూర్‌బాషా సంఘం తరఫున సర్వర్ వలిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర కమిటీ మెంబర్ ఇషాక్ మౌలానా, జిల్లా జేఏసీ నాయకులు హుసేన్ బాషా(బాబు), మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, గంగాధర్‌రెడ్డి, కడప కన్వీనర్లు మౌలానా జాకీర్ సాబ్, అహ్మద్ బాషా సాబ్, అఖిల పక్ష సంఘ నాయకులు వెంకటరమణ, సీపీఎం గఫూర్, రైతు కవి కొండారెడ్డి, బడుగు బలహీన వర్గాల నాయకులు, ధర్మపండితులు, నూర్ బాషా సంఘ నాయకులు, చర్చ్ పాస్టర్స్ మృత్యుంజయుడు, ఆనంద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు దేవస్థానం భూములకు వేలం

జమ్మలమడుగు రూరల్ : మోరగుడి గ్రామంలోని చెన్నకేశవ దేవస్థానం యొక్క భూములను ఈనెల 15వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు దేవస్థానంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మోరగుడి గ్రామంలోని సర్వే నెంబర్ 69లో 1.96 విస్తీర్ణం, 184–1లో 1.48 విస్తీర్ణం, 184–2లో 2.32 విస్తీర్ణం, 184–3లో 0.96 విస్తీర్ణం, 228–2లో 2.37 విస్తీర్ణం భూమిలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.1000 డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు.

లింగాలలో 74.4 మి.మీ వర్షం

లింగాల : మండల కేంద్రంలో సోమవారం రాత్రి 74.4 మి.మీ వర్షం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది రెయిన్ పాల్ ద్వారా రికార్డు అయ్యింది. బలమైన ఈదురు గాలులవల్ల విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలోని లింగాల, పెద్దకుడాల, చిన్నకుడాల, హిరోజ్‌పురం, ఇప్పట్ల తదితర గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరా స్తంభించిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి గాలులు వచ్చినా విద్యుత్ లైన్లు దెబ్బతిని వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భద్రత ఏర్పాట్ల పరిశీలన

చింతకొమ్మదిన్నె : తెలుగుదేశం పార్టీ రాష్ట్రస్థాయి మహానాడు సమావేశ భద్రత ఏర్పాట్ల పరిశీలన కొరకు మంగళవారం ఎస్ఎస్‌జీ, ఇంటెలిజెన్స్ పోలీసు ఉన్నతాధికారులు పబ్బాపురం సమీపంలోని మహానాడు సమావేశ ప్రాంతాన్ని పరిశీలించారు. భద్రత ఏర్పాట్ల పర్యవేక్షణకు వచ్చిన పోలీసు ఉన్నతాధికారుల బృందంతో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, అడిషనల్ ఎస్పీ ప్రకాష్‌బాబు, డీఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆదిత్య బిర్లాకు 25 మంది ఎంపిక

తొండూరు : స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం ఆదిత్య బిర్లా కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలో 25 మంది సెలెక్ట్ అయినట్లు ఆదిత్య బిర్లా హెచ్.ఆర్.కిరణ్ తెలిపారు. ఏపీఎం వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన ఇంటర్వ్యూలో మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన మహిళలకు కుట్టు శిక్షణలో ఆదిత్య బిర్లా కంపెనీ ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ రైతుల పొలాల సందర్శన



పొలాన్ని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి ప్రవీణ్‌కుమార్

సింహాద్రిపురం : మండలంలోని నంద్యాలంపల్లె, హైడిపాలెం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పొలాలను మంగళవారం ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి ప్రవీణ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల పొలాల్లో మొలకెత్తిన పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం వసంతకుమారి, డివిజన్ ఇన్‌చార్జి సుబ్బరాయుడు, మండల ఇన్‌చార్జి శ్రీనివాసులు, మోడల్ మేకర్ రమణ, రామకృష్ణ, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

నేలకొరిగిన అరటి



పులివెందుల రూరల్ : ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. చేతికొచ్చిన పంటను నేలపాలు చేశాయి. సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు పులివెందుల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు అరటి తోటలోని సుమారు 3వేల అరటి చెట్లు నేలకొరిగాయి. చేతికొచ్చే సమయంలో ప్రకృతి అరటిపై కన్నెర్ర చేయడంతో రూ.3లక్షల దాకా పంట నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

కడప అగ్రికల్చర్ : ఉద్యాన రైతులకు మరోసారి దెబ్బ పడింది. జిల్లాలో సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులు, అకాల వర్షంతో పలు మండలాల్లో మామిడి, అరటి, నిమ్మపంటలు నేలకొరిగాయి. దీంతో అన్నదాతలకు రూ. 88.20 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా నష్టాన్ని అంచానా వేసి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశారు. చక్రాయపేట, పులివెందుల, లింగాల, వేముల మండలాల్లో 239 మంది రైతలుకు సంబంధించిన 252 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

మండలాల వారిగా దెబ్బతిన్న పంటల వివరాలు...

జిల్లాలోని చక్రాయపేట మండలంలో 47 మంది రైతలుకు సంబంధించి 33 హెక్టార్లలో నిమ్మ, మామిడి పంటలు దెబ్బతిని రూ. 11.55 లక్షల మేర నష్టం వాటిల్లింది. అలాగే పులివెందుల మండలంలో 145 మంది రైతులకు సంబంధించి 165 హెక్టార్లలో అరటి దెబ్బతిని రూ. 57.65 లక్షలు, లింగాల మండలంలో 22 మంది రైతలుకు సంబంధించి 30 హెక్టార్లలో మామిడి దెబ్బతిని రూ.10.50 లక్షలు వేముల మండలంలో 25 మంది రైతలుకు సంబంధించి 24 హెక్టార్లలో అరటి పంట దెబ్బతిని రూ. 8.40 లక్షల మేర నష్టం వాటిల్లింది.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు



పాతసంగటిపల్లెలో బండలాగుతున్న ఎద్దులు

పెండ్లిమర్రి : మండలంలోని పాతసంగటిపల్లెలో లక్ష్మినరసింహస్వామి వార్షికోత్సవ ఉత్సవాలు మంగళవారం ఆలయ కార్యనిర్వాహకులు నిర్వహించారు. ఉదయం స్వామివారికి వేదపండితుల ఆధ్వర్యంలో అభిషేకం, గణపతి పూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే బండలాగుడు పోటీలు నిర్వహించి గెలు పొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతున్న సాయినాథ్ శర్మ



మోక్ష నారాయణ స్వామిని దర్శించుకుంటున్న నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : మండలంలోని రామాపురంలోని శ్రీ మహాలక్ష్మీ సమేత మోక్ష నారాయణస్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, సంజీవిని మూలిక సహిత వీరాంజనేయస్వామి వారి బ్రహ్మోత్సవాలు నాలుగు రోజులుగా జరుగుతున్నాయి. ఆలయ ప్రధాన సేవకుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు సత్య సాయినాథ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు భక్తులు విశేష సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు మాడ వీధులలో దేవతా మూర్తుల ఊరేగింపు ఉత్సవం కనుల పండువగా జరుగుతోంది. భక్తులకు అన్నదాన ఏర్పాటు చేస్తున్నారు.

ఎంపీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రత్యేక పూజలు : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి, ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభంతో వారికి స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతను వారికి సాయినాథ శర్మ వివరించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విగ్రహ మూర్తులు ఇక్కడ వెలియడం జిల్లాకే తలమానికం అని ఆయన సాయినాథ శర్మ అభినందనీయుడు అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వేద పండితులు ఘనపాఠి వంశీకృష్ణ శర్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కనుల పండువగా నరసింహుడి కల్యాణం



తిలకిస్తున్న భక్తులు



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

పెండ్లిమర్రి : మండలంలోని వెయ్యినూతల కొన పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మినరసింహస్వామి, లక్ష్మిదేవి అమ్మవార్ల కల్యాణోత్సవం మంగళవారం వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహ హరిప్రసాద్ ఆధ్వర్యంలో కనుల పండువగా జరిగింది. కల్యాణాన్ని తిలకించడానికి జిల్లా నలుమూల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కనులారా తిలకించారు. ముందుగా భక్తులు కోనేర్లల్లో స్నానాలు అచరించి స్వామివారికి మొక్కులు చెల్లించి కల్యాణంలో పాల్గొన్నారు. స్వామివారికి మధ్యాహ్నం గజవాహన సేవ, సాయంత్రం ధ్వజ అవరోహణం వంటి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామివారిని కోనేటి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి చక్రస్నానం చేశారు. ఉత్సవాలు ఐదు రోజుల పాటు వైభవంగా జరిగాయి.

పోటాపోటీగా బండలాగుడు పోటీలు



పోటీలలో బండను లాగుతున్న ఎద్దులు

లింగాల : మండలంలోని వెలిదండ్ల గ్రామంలో మంగళవారం వృషభరాజములచే బండలాగుడు పోటీలను నిర్వహించారు. మొలకల పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని వరదరాజులస్వామి ఆలయ కమిటీ ఈ బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోటా పోటీగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. సుమారు 8 కాండ్ల ఎద్దులు ఈ పోటీలలో పాల్గొన్నాయి. పెద్దకోతిపాడు గ్రామానికి చెందిన లక్షుమయ్యకు చెందిన ఎద్దులు 4879 అడుగులు బండను లాగి మొదటి స్థానంలో నిలిచి రూ.60వేలు, తిప్పిరెడ్డిపల్లెకు చెందిన విష్ణువర్థన్‌రెడ్డి ఎద్దులు 4065 అడుగులు బండలాగి రెండవ స్థానంలో నిలిచి రూ.40వేలు, అదే గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి ఎద్దులు మూడవ స్థానంలో నిలిచి రూ.30వేలు, పోటీలో పాల్గొన్న 8 కాండ్ల ఎద్దులకు ఆలయ కమిటీ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అలవలపాటి రమాదేవి, ఆలయ కమిటీ సభ్యులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

సర్వేకి వీధి వ్యాపారులు సహకరించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాముడు

పులివెందుల టౌన్ : వీధి వ్యాపారుల కమిటీ కోసం సర్వే చేస్తున్నామని.. ఈ సర్వేకు వీధి వ్యాపారులు సహరించాలని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని సభా భవనంలో వీధి వ్యాపారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారుల సర్వేకి వచ్చే మున్సిపల్ సిబ్బందికి సహకరించి వారు కోరిన సమాచారం ఇవ్వాలన్నారు. సర్వే చేసి యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వే ఐదు రోజులపాటు జరుగుతుందన్నారు. మెప్మా సిబ్బందితో ప్లానింగ్ సెక్రటరీ, వెల్ఫేర్ సెక్రటరీలు, ఆర్పీలతో కలిసి బృందాలుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అజయ్‌కుమార్, సీఎంఎం హరి, సీఓలు రామాంజనేయులు, నాగలక్ష్మి, వెల్ఫేర్ సెక్రటరీలు, ప్లానింగ్ సెక్రటరీలు, ఆర్పీలు పాల్గొన్నారు.